క్లుప్తంగా

ప్రజల సంక్షేమమే లక్ష్యం

తిరుపతి మంగళం: మంగళంలోని రణధీర్‌పురం గ్రామ పంచాయతీలో బుధవారం మంగళం రణధీర్‌పురం పంచాయతీ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పింఛన్‌దారులకు రూ.3 వేలు అందించారు. రాష్ట్రంలో జగనన్న, చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నిత్యం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉమాపతి, అధ్యక్షుడు రజాక్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

41 మందికి ఉద్యోగాలు

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తూ, వివిధ కారణాలతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మృతి చెందిన వారి కుటుంబసభ్యులు 41 మందికి బుధవారం ఉద్యోగాలు కేటాయించినట్లు ఆర్టీసీ ఇన్‌చార్జి ఈడీ టి.చెంగల్‌రెడ్డి తెలిపారు. కార్యాలయ సబార్డినేటర్లుగా ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. అందులో తిరుపతి జిల్లాలో 27మందికి, చిత్తూరు జిల్లాలో 6 మందికి, అన్నమయ్య జిల్లాలో 7మందికి ఉద్యోగాలు లభించాయని వెల్లడించారు.

ఇన్‌చార్జ్ ఎంపీపీల నియామకం

భాకరాపేట/తిరుపతి రూరల్: నియోజకవర్గం వర్గంలోని తిరుపతి రూరల్ ఇన్‌చార్జ్ ఎంపీపీగా వేముల యశోద, ఎర్రావారిపాళెం ఇన్‌చార్జ్ ఎంపీపీగా ఊటుకూరి రెడ్డెమ్మ బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఆయా మండల కేంద్రాల్లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీలుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయడానికి కృషి చేస్తానన్నారు.

వీల్‌చైర్ వితరణ



వీల్‌చైర్‌ను అందిస్తున్న దాత సుశీల

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి విచ్చేసే విభిన్న ప్రతిభావంతుల సౌకర్యార్థం అమ్మవారి భక్తురాలు బుధవారం వీల్‌చైర్‌ను విరాళంగా అందజేశారు. మదనపల్లెకు చెందిన సుశీల కుటుంబ సభ్యులతో కలసి బుధవారం ఆలయానికి విచ్చేసి ఆలయ సూపరింటెండెంట్‌కు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేసి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం వెలుపల పీఠాధిపతి సుగేంద్ర తీర్థ స్వామీజీ



పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం ఉడిపిలోని పుతేగి మఠం పీఠాధిపతి సుగేంద్ర తీర్థ స్వామీజీ, పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి ఎస్.నారాయణస్వామి వేర్వేరుగా దర్శించుకున్నారు. తిరుమల శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న వారికి రిసెప్షన్ డిప్యూటీ ఈఓ హరేంద్రనాథ్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సీఎం జగన్‌కు ఎస్వీయూ వీసీ కృతజ్ఞతలు



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీసీ

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ వీసీగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌రెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే తనను ఎస్వీయూ వీసీగా నియమించినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ నజీర్‌ను కలసి ధన్యవాదాలు తెలిపారు.

చేనేతలకు ప్రాధాన్యత ఇవ్వాలి



మాట్లాడుతున్న త్యాగరాజు

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలోని చేనేత సామాజిక వర్గానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించి తగిన గుర్తింపు ఇవ్వాలని రాజకీయ పార్టీలకు రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం మీడియా విభాగం ప్రధాన కార్యదర్శి గుత్తి త్యాగరాజు కోరారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా చేనే త ఉపకులమైన దేవాంగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని ముందుకు వచ్చే రాజకీయ పార్టీకే తాము మద్దతుగా నిలుస్తామన్నారు.

రూ.3 వేలు మురిపించన్

- పింఛన్‌దారులకు ముందే సంక్రాంతి
- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు
- దేశానికే ఆదర్శంగా రూ.1700 కోట్లతో తిరుపతి అభివృద్ధి
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి





పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, జీవకోనలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న పింఛన్‌దారులు

తిరుపతి మంగళం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలు పింఛన్‌ను అందించడంతో పింఛన్‌దారులకు పది రోజుల ముందే సంక్రాంతి పండుగ వచ్చిందని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. తిరుపతి జీవకోనలో బుధవారం రూ.3 వేల పింఛన్ పంపిణీని పండుగలా నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష రూ.3 వేల పింఛన్ సొమ్మును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో అర్హతే ప్రామాణికంగా ప్రతిపేదవాడికి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో పెత్తందారుల నుంచి వసూళ్లు చేసిన పన్నులను పేదలకు సంక్షేమ పథకాల ద్వారా అందిస్తూ పేదల పక్షపాతిగా సీఎం జగనన్న నిలిచిపోయారన్నారు. ఒక తిరుపతి నగర అభివృద్ధికే రూ.1700 కోట్ల నిధులను అందించిన గొప్ప నాయకుడు జగనన్న అన్నారు. దేశానికే ఆదర్శంగా తిరుపతి నగరాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. తిరుపతి నగరంలో 22మాస్టర్‌ప్లాన్ రోడ్లను నిర్మించి నగర ప్రజలకు స్వర్గధామంలా అభివృద్ధి చేశామన్నారు. మాస్టర్‌ప్లాన్‌రోడ్లతో ట్రాఫిక్ కష్టాలు తొలిగిపోయాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో గత 20 ఏళ్లుగా నెరవేరని టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాలను అందించామన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు రూ.6 వేలు వేతనం పెంపు, పోటు కార్మికులకు రూ.10 వేలు పెంపుతో పాటు టీటీడీ కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయడం జరిగిందన్నారు. దాంతో పాటు 26వేల మంది తిరుపతి నగర ప్రజలకు ఇంటి పట్టాలు ఇచ్చి వారి సొంతింటి కళ నెరవేర్చిన ఘనత కూడా జగనన్నదేనని సగర్వంగా చెప్పారు.

ప్రజల్లో దేవుడు సీఎం జగనన్న

కార్యక్రమంలో మేయర్ శిరీష మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అనేక సంక్షేమ పథకాలను అందించిన గొప్ప నాయకుడు జగనన్న అని కొనియాడారు. అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లల్లోనే ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజల్లో దేవుడయ్యారన్నారు. అలాంటి నాయకున్ని వచ్చే ఎన్నికల్లో తిరిగి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, టి.రాజేంద్ర, కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె. బాబు, టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, కార్పొరేటర్లు అన్నా సంధ్య, కోటేశ్వరమ్మ, రాధాకృష్ణారెడ్డి, మునిరామిరెడ్డి, అనీల్, కుమారి, శేఖర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ సురేంద్రరెడ్డి, జేసీఎస్ అధ్యక్షులు కిషోర్, శేఖర్, నాయకులు ప్రసాద్, రెడ్డప్పరెడ్డి, రఫీ, శారద, మురళి, స్వరూప్ పాల్గొన్నారు.

ఘనంగా శారదాదేవి జయంతి



జయంతి వేడుకల్లో పాల్గొన్న కమిటీ సభ్యులు

పాకాల: మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ మందిరంలో రామకృష్ణ సేవా సమితి ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్‌సీ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం దివ్యజనని శ్రీ శారదాదేవి 171వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 5.30 గంటలకు సుప్రభాతంతో పాటు పలు పూజాకార్యక్రమాలు చేపట్టారు. అనంతరం లెక్చరర్ డాక్టర్ సి.అరుణకుమారి శ్రీ శారదాదేవి జీవిత చరిత్రను ఆలపించారు. కార్యక్రమంలో కార్యదర్శి విశ్రాంత మేజర్ పి.రవినాయుడు, పరంధామనాయుడు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో..

తిరుపతి కల్చరల్: ఇస్కాన్ రోడ్డులోని శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమంలో శ్రీశారదామాత 171వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ప్రత్యేక హోమం చేపట్టారు. అనంతరం భక్తులు భజనలు చేస్తూ శారదామాతను కొలిచారు. ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానందాజీ, ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల డాక్టర్ నిర్మలాదేవి మాట్లాడుతూ శారదామాత జీవితం తొలినాళ్లలో సామాన్యంగా గడిచినప్పటికీ తర్వాత రామకృష్ణుని సన్నిధిలో ఆమె విశ్వమాతగా పరిణితి చెందారన్నారు.

మాట ఇవ్వడం.. నెరవేర్చడం జగనన్నకే సాధ్యం



భాకరాపేట: పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



కొత్త పింఛన్లను అందజేస్తున్న మోహిత్‌రెడ్డి

పాకాల/భాకరాపేట: రాష్ట్రప్రభుత్వం సంక్షేమ లక్ష్యంగా పాలన సాగిస్తోందని, మాట ఇవ్వడం.. దానిని నెరవేర్చడం మన సీఎం జగనన్నకే సాధ్యమని తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం నూతనంగా పెంచిన రూ.3000 పింఛన్‌ను ఆయన బుధవారం పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో, ఎర్రావారిపాళెం మండలంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా కులం, మతం, ప్రాంతం, వర్గం అంటూ తేడా లేకుండా పింఛన్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. పాకాల మండలంలో ఇప్పటివరకు 8,805 పింఛన్లు వచ్చేవని, కొత్తగా మరో 109 పింఛన్లు మంజూరు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పాకాల ఎంపీపీ లోకనాథం, కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లివేడు విక్రమ్‌రెడ్డి, స్టేట్ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రఘుపతి, ఎంపీడీఓ ప్రభాకర్, భాకరాపేట ఎంపీపీ రెడ్డెమ్మ, జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, ఆయా మండలాల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ పనుల పరిశీలన



అమ్మవారిని దర్శించుకుంటున్న టీటీడీ చైర్మన్ భూమన, మేయర్, ఆలయ చైర్మన్

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో చేపడుతున్న ఆలయ అభివృద్ధి పనులను టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి బుధవారం పరిశీలించారు. ముందుగా ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం అభివృద్ధి పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆలయం పనులను త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని తెలిపారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్లు ఎస్‌కే. బాబు, మోహన్‌కృష్ణ యాదవ్, ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, వైఎస్‌ఆర్‌సీపీ నేత తాళ్లూరి ప్రసాద్ పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ భూమనకు కృతజ్ఞతలు

తిరుపతి(అలిపిరి): తిరుమలలోని ఉగ్రాణంలో పని చేస్తున్న కార్మికులను స్కిల్డ్ కార్మికులుగా గుర్తించడంతో బుధవారం కార్మికులంతా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డిని కలిసి శాలువతో సన్మానించారు. తమ శ్రమను గుర్తించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

జగన్నాథ రెడ్డికి తుడా చైర్మన్ నివాళి



జగన్నాథరెడ్డి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొత్త శానంబట్లకు చెందిన జగన్నాథ రెడ్డి అంత్యక్రియల్లో బుధవారం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పాల్గొన్నారు. బుధవారం గ్రామానికి చేరుకున్న ఆయన అంతకుముందు జగన్నాథరెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అత్యవసరాల కోసం రూ.20 వేలు నగదును అందజేశారు. మృతుని బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఏ అవసరం వచ్చినా తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. పంజాబీ దాబా వద్ద ప్రమాదాల నియంత్రణకు, వేగ నిరోధక చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఒకరికి ఒకరు తోడుగా ఉందాం



మాట్లాడుతున్న ఆర్టీసీ ఇన్‌చార్జ్ ఈడీ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగులంతా ఒకే కుటుంబంలా ఒకరికి ఒకరు తోడుగా ఉంటూ సమిష్టిగా సేవలను సద్వినియోగం చేసుకోవాలని కడప జోన్ ఇన్‌చార్జ్ ఈడీ టి.చెంగల్‌రెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతి డీపీటీఓ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగుల పదో వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ముందుగా డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2024 వరకు పదేళ్లపాటు ఏపీఎస్‌ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తిరుపతి రీజియన్ కమిటీ దిగ్విజయంగా ముందుకు సాగడం సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కైలాసనాథ్, స్టేట్ సెక్రటరీ జేఎంఆర్ నాయుడు, రీజనల్ ప్రెసిడెంట్ చంద్రయ్య, రీజనల్ సెక్రటరీ శేషాద్రి, రీజనల్ ట్రెజరర్ సహదేవ్, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, రీజనల్ పబ్లిసిటీ సెక్రటరీ మునిరత్నం పాల్గొన్నారు.

హారతులు పట్టి.. ఆత్మీయత పంచి..



చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి దాసరవీధిలో స్వాగతం పలుకుతూ, గజమాలతో సత్కరిస్తున్న ప్రజలు

చంద్రగిరి: సీఎం జగనన్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చితే, చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన మేలును చెబుతూ ప్రజల ముందుకు వస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి ఆత్మీయత అభిమానంతో సాదర స్వాగతం లభిస్తోంది. చంద్రగిరి పట్టణంలో బుధవారం సర్పంచ్ ముద్దికుప్పం రూపరామ్మూర్తి అధ్యక్షతన జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డితో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. స్థానిక సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చొరవ చూపుతూ ముందుకు సాగారు. చంద్రగిరి పంచాయతీ పరిధిలో గడప గడపకు వెళ్లిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. వచ్చే ఎన్నికల్లో తన అన్నయ్య మోహిత్ రెడ్డిని ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ చేగు గోవర్ధన్ గుప్తా, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ముదికుప్పం రామ్మూర్తి, నాయకులు మస్తాన్, బాలాజీ, రవి, నామాల శ్రీనివాసులు, మల్లి, సుబ్రమణ్యం, ధనుంజయులు, భాను, ద్వారక, పార్వతి, ఉగ్రాణం జగన్, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూరీసర్వే



పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ శుభం భన్సల్

రామచంద్రాపురం: భూరీసర్వేను పారదర్శకంగా చేపట్టాలని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ అన్నారు. బుధవారం మండలంలోని కేకేవీ పురంలో జరుగుతున్న భూరీసర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమక్షంలో భూరీసర్వే నిర్వహించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ–క్రాప్ బుకింగ్ ప్రక్రియను పరిశీలించిన ఆయన పంట నమోదు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, ఏఓ స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

దశదిశలా తిరుపతి నగర అభివృద్ధి



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక తిరుపతి నగరం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందని టీటీడీ చైర్మన్ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి అన్నారు. కొర్లగుంట తిరుమల రెడ్డి నగర్ పోస్టల్ కాలనీ ప్రాంతాల్లో నూతనంగా అభివృద్ధి చేసిన సీసీ రోడ్లు, యూడీఎస్ లైన్లను నగర మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో తిరుపతి నగరాన్ని మరింత అభివృద్ధి వైపు నడిచేలా ప్రణాళికలు రచించామన్నారు. ప్రస్తుతం తిరుపతిలో చేపట్టిన అభివృద్ధి పనులతో నగర దశదిశ మారుతుందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ రాజీ లేని నిర్ణయాలతో నగర అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, కార్పొరేటర్లు ముని రామిరెడ్డి, ఆదం లీలావతి, అనిల్ కుమార్, ఉమా అజయ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు విజయ్ కుమార్ రెడ్డి, సంజయ్, మహేష్, నాయకులు, అనుబంధ సంఘాల నేతలు, డివిజన్ అధ్యక్షుడు పాల్గొన్నారు.

త్యాగశీలి సావిత్రిబాయి సేవలు మరువలేనివి





సావిత్రిబాయి పూలేకి నివాళులు అర్పిస్తున్న బీసీ సంఘ నేతలు, చంద్రగిరిలో..
నగర పాలక పాఠశాలలో..

తిరుపతి కల్చరల్/తిరుపతి(అలిపిరి): తన ఇంటినే పాఠశాలగా మార్చి అనేక అవరోధాలకు ఎదురొడ్డి మహిళల కోసం జీవితాన్ని అర్పించిన త్యాగశీలి సావిత్రిబాయి పూలే అని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్లూరి నాగరాజగౌడ్, సోమశేఖర్ ఆచారి, ఉపాధ్యక్షుడు మధు తెలిపారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నరసింహతీర్థ రోడ్డులోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన 17వ ఏట దళిత బహుజనుల కోసం పాఠశాలను ప్రారంభించిన తొలి మహిళ సావిత్రిబాయి పూలే అని తెలిపారు. మహిళా సాధికారతకు శ్రీకారం చుట్టి ధీర వనితగా సావిత్రిబాయి పూలే నిలిచారన్నారు. అనంతరం చెన్నారెడ్డి కాలనీలోని ప్రభుత్వ బాలికల బీసీ వసతి గృహంలో 130 మంది బాలికలకు పుస్తకాలు, స్వీట్లు, బిస్కెట్లు అందించారుఅనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆదిలక్ష్మి, ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ విద్యార్థి విభాగం అధ్యక్షుడు జి.వాసుకుమార గౌడ్, బీసీలు పాల్గొన్నారు.

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి తీర్థకట్టవీధిలోని నగరపాలక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. పాఠశాల హెచ్ఎం పుష్పలత, టీచర్లు సునీతను దుశ్శాలువతో సత్కరించారు.

పాకాలలో..

పాకాల: మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో అధ్యక్షుడు గుండ్లపల్లి ఆంజనేయులు అధ్యక్షతన సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ స్త్రీవిద్య కోసం ఆమె చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో భవన్ సభ్యులు పాల్గొన్నారు.

మొగరాల, దామలచెరువు స్కూళ్లలో..

మండలంలోని మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం సుమల ఆధ్వర్యంలో, దామలచెరువు ఎంపీపీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతంర మహిళా ఉపాధ్యాయులు ప్రమీళమ్మ, లక్ష్మీదేవి, సూర్జహాన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో హెచ్ఎం విజయ్‌మోహన్, రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్కిల్ సదస్సు ప్రారంభం



మాట్లాడుతున్న రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: కొండారెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్‌లో రెండు రోజుల పాటు తలపెట్టిన ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్కిల్స్ సదస్సు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ కంపెనీలలో ఉద్యోగాలు ఉన్నా విద్యార్థులు అర్హత పొందలేకపోతున్నారని అన్నారు. దీనికి ప్రధాన కారణం కమ్యూనికేషన్ స్కిల్స్ లేకపోవడమేనన్నారు. విశ్వాసం, ఏకాగ్రత, కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పెద్ద లక్ష్యాలను ఎంచుకుంటే వారే లీడరుగా, విజేతలుగా ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో నూతన ఎంసీఏ, ఎంబీఏ, ఎమ్మెస్సీ విద్యార్థులు, హెచ్ఓడీలు డాక్టర్ నిరంజన్‌రెడ్డి, మధుర, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజు క్షత్రియ రాణుల ఐక్య వేదిక ఏర్పాటు

తిరుపతి కల్చరల్: రాజు క్షత్రియ రాణుల ఐక్య వేదికను ఏర్పాటు చేసినట్లు రాజుల రాజకీయ చైతన్య వేదిక వ్యవస్థాపకుడు జి.సుకుమార్ తెలిపారు. రాజు క్షత్రియ రాణుల ఐక్య వేదిక అధ్యక్షురాలిగా రుద్రరాజు శ్రీదేవి, కన్వీనర్‌గా జి.వసంత, కో–కన్వీనర్‌గా రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ జి.లక్ష్మీదేవి, సభ్యులుగా దాసరి రాజు మురళమ్మ, ప్రశాంతి, లక్ష్మీదేవి, సుజాతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన మహిళా క్షత్రియ సోదరీమణులతో ఏర్పాటైన ఈ ఐక్యవేదిక ద్వారా క్షత్రియుల అభివృద్ధికి కార్యచరణను రూపొందిస్తామన్నారు. భవిష్యత్‌లో పలు సేవా కార్యక్రమాల నిర్వహణతో సమాజ హితం కోసం కృషి చేస్తారని తెలిపారు.

వర్సిటీ అభివృద్ధికి కృషి చేయండి

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ నాయకులు బుధవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని వారు ఆయనను కోరారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రీ, డాక్టర్ అంజద్ అలీ బేగ్, జీపీసీ ముర్తుగ, బాష, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.